

సోమశిలలో 70.255 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 70.255 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1941 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.81,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,350
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,570
నవర (8 గ్రాములు)	రూ.60,560

గరిష్టం/కనిష్టం
30.5 /23.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం గురువారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ బుధవారం 69 శాతంగా నమోదైంది.

దివ్యాంగుల పింఛన్లకు కోత!



రీ వెరిఫికేషన్‌కు డాక్టర్ల బృందం

- వైద్యం అందక రోగుల ఇబ్బందులు
- తొలి దశలో బెడ్‌రిడన్ రోగులు
- రెండో దశలో దివ్యాంగులకు కత్తెర
- జిల్లాలో 1,279 మంది బెడ్‌రిడన్, 32 వేల దివ్యాంగుల పింఛన్లు
- కొత్తగా సదరమ్ సర్టిఫికెట్ల జారీ నిలిపివేత

నెల్లూరు(అర్బన్): జిల్లాలో బెడ్‌రిడన్ (మంచానికే పరిమితమైన) రోగులకు గతంలో డాక్టర్లు పరిశీలించి మంజూరు చేసిన సదరమ్ సర్టిఫికెట్‌లను ఇంటింటికీ వెళ్లి మళ్లీ రీవెరిఫికేషన్ చేసేందుకు ప్రభుత్వం పెద్దాస్పత్రిలోని డాక్టర్లను నియమించడంతో వైద్యం అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దివ్యాంగులు, బెడ్‌రిడన్ రోగులైన అర్హులందరికీ డాక్టర్ల ద్వారా సదరమ్ సర్టిఫికెట్‌లు ఇచ్చి పింఛన్లు మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఒక్కరు కూడా పింఛన్ రాలేదని అనకుండా ఉండేలా సాచురేషన్(జీరో) స్థాయికి పింఛన్లు ఇచ్చేలా చర్యలు చేపట్టారు. నేటి కూటమి ప్రభుత్వం గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లకు కోత పెట్టేందుకు పావులు కదిపింది. తద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు పూనుకుంది. తొలిదశలో బెడ్‌రిడన్ పేషెంట్లకు కోత పెట్టేందుకు డాక్టర్లను రీవెరిఫికేషన్ పేరిట ఇంటింటికీ పంపుతోంది. ప్రధానంగా నగరంలోని పెద్దాస్పత్రిలో ఉండే డాక్టర్లను రీవెరిఫికేషన్‌కు పంపడంతో రోగులకు వైద్యం అందడం లేదు.

దశలవారీగా 'కోత'

ఏడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారుల సర్టిఫికెట్‌ల రీవెరిఫికేషన్‌కు శ్రీకారం చుట్టింది. ప్రజావ్యతిరేకత ఒక్కసారిగా రాకుండా ప్రభుత్వం దశలవారీగా పింఛన్లకోతకు రంగం సిద్ధం చేసింది. జిల్లాలో 3,07,000 మంది సామాజిక పింఛన్‌దారులున్నారు. వారిలో దివ్యాంగులైన వారు 32వేల మంది. బెడ్‌రిడన్ రోగులు 1279 మంది. సామాజిక పింఛన్‌లు ఒక్కొక్కరికీ రూ.3వేల నుంచి 4వేలకు, దివ్యాంగులకు రూ.6వేలకు, బెడ్‌రిడన్ రోగులకు రూ.15వేలకు పెంచుతున్నామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచినట్టు పెంచి ఇప్పుడు ఆ పింఛన్లకు భారీస్థాయిలో కోత విధించేందుకు పూనుకుంది.



ఓపీ చీటీల కోసం వేచివున్న రోగులు

సదరమ్ సర్టిఫికెట్‌ల నిలిపివేత

ఉన్న సదరమ్ సర్టిఫికెట్‌లను వెరిఫై చేసేంత వరకు కొత్త సదరమ్ సర్టిఫికెట్‌లను జారీ చేయవద్దని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రతి మంగళవారం, శుక్రవారం పెద్దాస్పత్రిలో జరిగే సదరమ్ క్యాంపులు నిలిచిపోయాయి. ఫలితంగా వికలాంగత్వం ఉన్నట్టు సదరమ్ సర్టిఫికెట్ తెచ్చుకుంటే తమకు పింఛన్ వస్తుందని ఆశించిన దివ్యాంగుల ఆశ అడియాశ అయింది.

మంజూరైనవీ ఆపేశారు

పెద్దాస్పత్రిలో గతంలో దరఖాస్తు చేసుకుని డాక్టర్లు పరిశీలించి వికలాంగత్వ శాతాన్ని ధ్రువీకరించి సంతకం చేసిన సర్టిఫికెట్‌లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ లాగిన్‌లో 92 సిద్ధంగా ఉన్నాయి. వీటిని కూడా సూపరింటెండెంట్ రిలీజ్ చేయలేదు. ఆ 92 మంది పొట్ట కూడా కొట్టారు. మరో వైపు మరో 80 మంది ఇప్పటికే సదరమ్ సర్టిఫికెట్‌ల కోసం దరఖాస్తు చేసుకుని ఉన్నారు. ఇవన్నీ నిలిచిపోయాయి. కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు సైతం ప్రభుత్వం అవకాశం కల్పించలేదు.



రోగులను పరిశీలిస్తున్న డాక్టర్లు

వైద్యసేవలు నిర్వీర్యం

అనుభవజ్ఞులైన డాక్టర్లు క్షేత్ర స్థాయిలో రీవెరిఫికేషన్‌కు పోవడంతో పెద్దాస్పత్రిలో వైద్యసేవలు నిర్వీర్యంగా మారాయి. ఎంబీబీఎస్ చదువుతూ ఫైనల్ ఇయర్‌లో ఉన్న ట్రెనింగ్ డాక్టర్లు చేసే వైద్యం అంతంత మాత్రమే. పెద్దాస్పత్రిలో రోజుకు 1200 నుంచి 1500 వరకు ఓపీ రోగులుంటారు. 550 మంది వరకు అడ్మిషన్‌లో రోగులుంటారు. ఈ రోగులకు ట్రెనింగ్‌లో ఉన్న జూనియర్ డాక్టర్లే వైద్య సేవలందిస్తూ ఉండటం వల్ల నాణ్యమైన వైద్యం రోగులకు అందడం లేదు. ముసలి వారైన ప్రొఫెసర్లు అడ్మిషన్‌లో ఉన్న రోగుల వద్దకు వెళ్లాలి. వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠాలు బోధించాలి. అప్పటికే వీరికి ఓపిక తగ్గిపోతోంది. ఇక ఓపీ సేవలు అందించాలంటే వారికి కష్టంగా మారుతుంది. పెథాలజీ లాంటి కోర్సు చేసిన నాన్-క్లినికల్ డాక్టర్లు ఇప్పటి వరకు వారి చరిత్రలో రోగులకు వైద్యం చేయలేదు. డాక్టర్ల కొరత ఉండటంతో అలాంటి కొంతమంది నాన్-క్లినికల్ వైద్యుల ద్వారా రోగులకు సేవలందిస్తున్నారు. వీరికి కొత్తగా వచ్చిన మందుల గురించి కూడా అవగాహన తక్కువే. అందువల్ల వారు చేసే సేవలు అంతంత మాత్రమే. హుషారుగా ఉండే అసిస్టెంట్ ప్రొఫెసర్లు(డాక్టర్లు) సదరమ్ సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్‌కు వెళ్లడంతో రోగుల వైద్యం.. గాల్లో దీపంలా మారింది. ఇకనైనా పరిస్థితులు చక్కదిద్దాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం



డాక్టర్లు సదరమ్ సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్‌కు వెళ్లినప్పటికీ ఆ కొరత లేకుండా తాము ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. వెరిఫికేషన్‌కు వెళ్లిన వారు కూడా మధ్య, మధ్యలో కొన్ని రోజులు ఆస్పత్రికి వస్తుంటారు. ఇక్కడ పీజీ చేస్తున్న మంచి వైద్యులున్నారు. కొంతమందిని నాన్‌క్లినికల్ వారిని సందర్భాన్ని బట్టి ఉపయోగించుకుంటాం. రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకున్నాం. – డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, సర్వజన ఆస్పత్రి

తొలిదశలో 1279 మందికి రీవెరిఫికేషన్

నెల్లూరు జిల్లాలో 1279 మంది బెడ్‌రిడన్ రోగులున్నారు. అలాగే తిరుపతి, చిత్తూరు లాంటి అన్ని జిల్లాల్లోనూ ఉన్నారు. వీరిని క్షేత్ర స్థాయిలో వెరిఫికేషన్ చేసేందుకు నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన 11 మంది డాక్టర్లను, ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన ఆరుగురిని, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల నుంచి మరో ఆరుగురిని నియమించారు. వీరు తిరుపతి, చిత్తూరు జిల్లాలలోని బెడ్‌రిడన్ రోగులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారు పొందిన సదరమ్ సర్టిఫికెట్‌లను మరలా సర్టిఫై చేయాల్సి ఉంది. అలాగే తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి నెల్లూరు జిల్లాకు వచ్చి ఇక్కడి రోగులను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. ఇలా పరిశీలించే సందర్భంగా అధికారుల మౌఖిత ఆదేశాల మేరకు కనీసం 40 శాతం సర్టిఫికెట్‌లను రద్దు చేయాల్సి ఉంటుందని డాక్టర్లు పేర్కొంటున్నారు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఆరు నెలల సమయం పట్టవచ్చు

జిల్లాలో బెడ్‌రిడన్ రోగులను మళ్లీ పరీక్షించేందుకు సుమారు 2 నెలలు పడుతుందని డాక్టర్లు పేర్కొంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే మిగతా దివ్యాంగుల సర్టిఫికెట్‌లను వెరిఫై చేయాల్సి ఉంది. ఇందుకు మరో 4 నెలల సమయం పట్టనుంది. మొత్తం 6 నెలల వరకు డాక్టర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి రోగులను పరీక్షించాల్సి ఉంది. అనుమానితులను పెద్దాస్పత్రికి తీసుకుని వచ్చి పరీక్షలు చేయించాల్సి ఉంది. ఈ 6 నెలల కాలంలో రోగులకు నాణ్యమైన వైద్యం అందక అల్లాడిపోతారని డాక్టర్లు పేర్కొంటున్నారు.

న్యూస్‌రీల్

జోరుగా కోడిపందేలు

- ప్రేక్షకపాత్రలో పోలీసులు



చెర్లోపల్లిలో నిర్వహిస్తున్న కోడిపందేలు

ఉదయగిరి: సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని సోమ, మంగళ, బుధవారాల్లో ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాలలో కోడిపందేలు జోరుగా నిర్వహించారు. కోళ్లకు కత్తులు కట్టి, సై అంటే సై అంటూ బరిలోకి దింపారు. ఈ పోటీల్లో లక్షలాది రూపాయల పందేలు జోరుగా సాగాయి. ఉదయగిరి మండలంలోని చెరువుపల్లి, చెర్లోపల్లి, కృష్ణంపల్లి, వెంకట్రావుపల్లి తదితర గ్రామాలలో పోటీలు జరిగాయి. వరికుంటపాడు మండలం గణేశ్వరపురం, తోటలచెరువుపల్లి, పెద్దిరెడ్డిపల్లి, విరువూరు తదితర గ్రామాలు, కొండాపురం మండలం తూర్పుయడవల్లి, చింతలదేవి గ్రామాలలో కూడా కోడిపందేలు జరిగాయి. ఈ సందర్భంగా పై పందేలు లక్షల్లో జరిగాయి. నిర్వాహకులు పోలీసులకు మామూళ్లు ఇవ్వడంతో బహిరంగంగా కోడిపందేలు జరుగుతున్నా కనీసం ఆ దరిదాపులకు కూడా వెళ్లలేదు.

ఆర్చరీ జట్ల ఎంపికలు 19న

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఆర్చరీ జట్ల ఎంపికలను ఈనెల19న స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణులు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 9441955334 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

శ్రీవారి సేవలో జ్యోతిర్మయి



పెంచలకోనలో జ్యోతిర్మయి

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో వెలసియున్న శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని ప్రముఖ ప్రవచన కర్త, గాయని కొండవీటి జ్యోతిర్మయి కుటుంబసభ్యులతో కలసి బుధవారం దర్శించుకున్నారు. ఈమెకు దేవస్థాన అధికారులు స్వాగతం పలికి మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆమె శ్రీవారి కల్యాణ మండపంలో నరసింహస్వామిని కీర్తిస్తూ పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హైదరాబాద్, బెంగళూరులకు 81 ప్రత్యేక బస్సులు



నెల్లూరు సిటీ: సంక్రాంతి పండుగను ముగించుకుని తిరిగి హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లేందుకు జిల్లా నుంచి ఆర్టీసీ 81 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ప్రజా రవాణా అధికారి మురళీబాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు 51 బస్సులు, బెంగళూరుకు 30 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. సాధారణ చార్జీలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంక్రాంతి కిక్కు రూ.21 కోట్లు



నెల్లూరు(క్రైమ్): సంక్రాంతి పండుగ నేపథ్యంలో మద్యం ఏరులై పారింది. అక్షరాల రూ.21.02 కోట్ల మద్యాన్ని తాగేశారు. ఈనెల 14, 15 తేదీల్లో ఐఎంఎల్ డిపోకు సెలవు కావడంతో వ్యాపారులు ముందుగానే భారీగా స్టాక్‌ను మద్యం దుకాణాల్లో నిల్వ చేశారు. 11 నుంచి 13వ తేదీ వరకు రూ.21,02,50,000 విలువ చేసే మద్యాన్ని వ్యాపారులు ఐఎంఎల్ డిపో నుంచి కొనుగోలు చేశారు. పండుగ రోజుల్లో మద్యం ప్రియులు మత్తులో మునిగి తేలారు. వారితో మద్యంషాపులు, బార్లు కిక్కిరిశాయి. మద్యం దుకాణాల్లో అధికంగా సేల్ అయ్యే బ్రాండ్లు ఖాళీ అవడం, డిపో నుంచి సరుకు వచ్చే అవకాశం లేకపోవడంతో చేసేదేమీ లేక ఉన్న బ్రాండ్లతోనే మందుబాబులు సరిపెట్టుకున్నారు.

2027లో జమిలి ఎన్నికలు ఖాయం



స్వగ్రామం తోడేరులో గ్రామస్తులతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- కూటమి పాలనలో కళతప్పిన సంక్రాంతి
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: 2027లో జమిలి ఎన్నికలు రావడం ఖాయమని, కార్యకర్తలు అందుకు సంసిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. స్వగ్రామం తోడేరులో కాకాణి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి మంగళవారం సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ముందుగా సమితి మాజీ అధ్యక్షుడు, కాకాణి తండ్రి రమణారెడ్డి ఘాట్ వద్ద కుటుంబసభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో సంక్రాంతి పండుగ కళ తప్పిందని, ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల అన్ని వర్గాల ప్రజలు పండుగను జరుపుకోలేకపోయారని అన్నారు. రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం కుదువ దుకాణాల వద్దకు బారులు తీరడంతో కుదువ దుకాణాలు కళకళలాడినట్టు తెలిపారు. గతేడాది ఇదే సమయంలో రాష్ట్ర ప్రజలు సంక్రాంతి వేడుకలను ఎంతో సంతోషంగా జరుపుకున్నట్టు తెలిపారు. చంద్రబాబు నాయుడు ఏ ఒక్క వర్గాన్ని సంతోష పెట్టలేకపోతున్నట్టు విమర్శించారు. రైతులను ఆదుకోకపోవడం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేయకపోవడం, మహిళలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల పండుగలు వెలవెల పోయినట్టు తెలిపారు. సర్వేపల్లి ప్రజలతో పాటు, జిల్లా ప్రజానీకం సుఖసంతోషాలతో ఉండాలని కాకాణి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు

- విజేతగా వైఎస్సార్ జిల్లా ఎడ్లు
- ఆసక్తిగా తిలకించిన ప్రజలు

జలదంకి: సంక్రాంతిని పురస్కరించుకుని జలదంకి మండలం బ్రాహ్మణక్రాక శివాలయం వద్ద మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీల్లో వైఎస్సార్ జిల్లా చౌటుపల్లికి చెందిన మార్తల చిన ఓబులరెడ్డి ఎడ్లు 20 నిమిషాల వ్యవధిలో 4182 అడుగుల దూరం వరకు బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50 వేల నగదు బహుమతి సాధించాయి. అలాగే వైఎస్సార్ జిల్లా వేంపల్లి మండలం గాజులపేటకు చెందిన పసుపులేటి రమణయ్య ఎడ్లు 20 నిమిషాల వ్యవధిలో 3321 అడుగుల దూరం బండ లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.40 వేలు దక్కించుకున్నాయి. వైఎస్సార్ జిల్లా పొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన మార్తల వెంకట సుబ్బారెడ్డి ఎడ్లు 20 నిమిషాల వ్యవధిలో 3300 అడుగుల దూరం బండ లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ.30 వేలు దక్కించుకున్నాయి. మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలె సురారెడ్డి ఎడ్లు 20 నిమిషాల వ్యవధిలో 3139 అడుగుల దూరం బండ లాగి నాల్గవ స్థానంలో, వేముల మండలం బెస్తవారిపల్లెకు చెందిన గండ్లపెంట జతిన్ విహాన్ ఎడ్లు 20 నిమిషాల వ్యవధిలో 3018 అడుగుల దూరం బండ లాగి ఐదవ స్థానంలో నిలిచాయి. ఈ పోటీలను ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకట కృష్ణారెడ్డిలు ప్రారంభించారు.



పోటీల్లో బండను లాగుతున్న ఎడ్లు




ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల యజమానికి నగదు బహుమతి అందజేస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

బహుమతుల ప్రదానం

ఎడ్ల బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి మొత్తాన్ని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అందించారు. రెండో బహుమతిని ఇందూరి శంకరలింగం బ్రదర్స్, మూడో బహుమతిని పెద్దిరెడ్డి బ్రదర్స్, నాల్గవ బహుమతిని పున్నం రోశిరెడ్డి, ఐదవ బహుమతిని వేలమూరి రాంమోహన్‌రెడ్డిలు సమకూర్చారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన వారికి నిర్వాహకులు అన్నదానం చేశారు. పోటీలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్సై లతీపున్నీసా ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వంటేరు నందగోపాల్‌రెడ్డి, పున్నం రోశిరెడ్డి, జిలుమూడి వినయ్‌కుమార్‌రెడ్డి, మేకల శ్రీనాథ్‌రెడ్డి, గాడేపల్లి మల్లికార్జున, జిలుమూడి వేణుగోపాల్‌రెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉల్లాసంగా తెప్పల పోటీలు



గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతూ..



లేక్‌వ్యూ కాలనీ వద్ద ప్రారంభమైన తెప్పల పోటీలు



పోటీలను తిలకిస్తున్న నగరవాసులు

సంక్రాంతి పండగను పురస్కరించుకొని పొదలకూరురోడ్డు లేక్‌వ్యూ కాలనీ వద్ద స్వర్ణాలచెరువులో బుధవారం మత్స్యకారులకు పడవలు, తెప్పల పోటీలు బర్నబాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో మత్స్యకారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నగర ప్రజలు పోటీలను ఆసక్తిగా వీక్షించారు. – నెల్లూరు(బృందావనం)

క్లుప్తంగా

యూట్యూబ్ జర్నలిస్టు ఆత్మహత్య



సయ్యద్ రబ్బానీ (ఫైల్)

అనుమసముద్రంపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యూట్యూబ్ జర్నలిస్ట్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. ఎస్సై సైదుల సమాచారం మేరకు.. ఏఎస్‌పేటకు చెందిన సయ్యద్ రబ్బానీ (36) ఓ యూట్యూబ్ చానల్‌లో ఆత్మకూరు నియోజకవర్గ విలేకరిగా గత రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాభర్తల గొడవలతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్నారు.

కూటమి నేతల మధ్య మద్యం వివాదం


- మఫ్టీలో ఉన్న పోలీసు అధికారిపైనే దాడికి యత్నం
- ఇంత జరిగినా కౌన్సెలింగ్ ఇచ్చి పంపిన పోలీసులు

ఆత్మకూరు: కూటమి పార్టీల నేతలు రాజ్యాంగేతర శక్తుల్లా వ్యవహరిస్తున్నారు. చోటా మొదలు బడా నాయకుల వరకు అధికారులను శాసించడంతోపాటు చివరకు దాడులకు కూడా తెగబడుతున్నారు. తాజాగా ఆత్మకూరు పరిధిలో జరిగిన ఓ వ్యవహారంలో టీడీపీ నేతలు ఓ పోలీస్ అధికారిపైనే దాడికి ప్రయత్నించినా.. వారిని ఏమీ చేయలేక కౌన్సెలింగ్ ఇచ్చి పంపించడం చర్చనీయాంశంగా మారింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషయానికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. ఏఎస్‌పేట మార్గంలోని ముస్తాపురం వద్ద ఉన్న ఓ లేఅవుట్ స్థలంలో ఆదివారం రాత్రి ఆ గ్రామానికి చెందిన కొందరు మద్యం తాగుతున్నారు. అదే సమయంలో ఆత్మకూరుకు చెందిన కూటమి నేతలు కొందరు మద్యం తాగేందుకు అక్కడికే వెళ్లారు. ఈ లేఅవుట్లో మందు తాగి సీసాలు పడేస్తారా? ఇది మాది అంటూ వారిని దబాయించారు. దీంతో స్థానికులు వెళ్లిపోయారు. భోగి పండగ రోజు స్థానికులు కొందరు లేఅవుట్ రాళ్లను పెరికి దూరంగా వేశారు. మద్యం తాగి ఖాళీ బాటిళ్ల అక్కడే పడేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మద్యం తెచ్చేందుకు లేఅవుట్‌కు సంబంధించిన వారిలో ఓ యువకుడు బైక్‌పై ఒంటరిగా వెళ్తుండడంతో గ్రామస్తులు అతన్ని వెంబడించి నిలిపి గొడవ పడ్డారు. ఈ విషయం తెలుసుకుని వీరూ అక్కడికి చేరుకోవడంతో గొడవ ముదిరింది. అదే సమయంలో ఆత్మకూరు డివిజన్ పోలీస్ ఉన్నతాధికారి ఆ మార్గంలో మఫ్టీలో వస్తుండగా చూసి ఘటనా స్థలానికి వచ్చారు. వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా ఆయనపై వారు దాడికి యత్నించారని సమాచారం. ఈ ఘటనను ఆ అధికారి వాహన డ్రైవర్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అయితే ఆ ఉన్నతాధికారి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ వీడియో సీఐకి పంపి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో సీఐ సిబ్బందితో వెళ్లి వారిలో 8 మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. గొడవకు కారణమైన వాళ్లు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు కావడంతో విషయం రచ్చకెక్కకుండా కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు సమాచారం. ఈ విషయమై డీఎస్పీ కె వేణుగోపాల్‌ను సంప్రదించగా ఎలాంటి గొడవ చోటు చేసుకోలేదని, రోడ్డుపై కొందరు గుమిగూడి ఉంటే ఆ సమయంలో వస్తున్న తాను వారిని అరిచి పంపేశానని తెలిపారు.

బీమా భారం.. ఏం ప్రయోజనం

రైతు ప్రభుత్వమని నిస్సిగ్గుగా చెప్పుకునే టీడీపీ.. ఎన్నికల ముందు ఎన్నెన్నో హామీలు గుప్పించింది. గతంలోనూ అధికారంలో ఉండగా రైతులకు రుణ మాఫీ చేస్తానని మోసం చేసింది. ఈ దఫా అన్నదాత సుఖీభవ ఇస్తానని హామీలు గుప్పించింది. గత ఐదేళ్లు రైతులకు సంబంధించి పంటల బీమా ప్రీమియంను అప్పటి ప్రభుత్వమే చెల్లించింది. ఇటీవల ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకున్న టీడీపీ బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలంటూ తొలి వెన్నుపోటు పొడిచింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ రైతులు బీమా చెల్లించినప్పటికీ నష్టం జరిగినా పరిహారం దక్కని పరిస్థితులు గుర్తు చేసుకుని ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రాలేదు.

- పంటల బీమా ప్రీమియం చెల్లించడానికి రైతుల ససేమిరా
- జిల్లాలో సుమారు 7.77 లక్షల ఎకరాలకు పైగా పంటల సాగు
- దాదాపు 3.25 లక్షల వరకు రైతులు
- ఇప్పటి వరకు కేవలం బీమా కట్టింది.. 1,974 మంది రైతులే
- పరిహారం చెల్లింపుల్లోనూ మెలికలు పెట్టడమే కారణం
- ఈ నెల 15వ తేదీతో ముగిసిన గడువు





సాగులో ఉన్న వరి పైరు

నెల్లూరు (సెంట్రల్): ఒక పక్క పెట్టుబడి సాయం అందక, మరో పక్క దారుణంగా పతనమైన ధాన్యం ధరల నేపథ్యంలో రైతులు భవిష్యత్‌ను తలుచుకుని దిగాలు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పులిపై పుట్రలా.. గత ప్రభుత్వం ఉచితంగా అమలు చేసిన పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది. బీమా ప్రీమియంను రైతులే చెల్లించాలంటూ నిబంధన విధించింది. ఇప్పటికే వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగిపోయి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం ఇప్పటికే రైతు భరోసా పథకానికి పంగనామాలు పెట్టింది. మరో పక్క ధాన్యం ధరలు తగ్గిపోతున్నా.. పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది.

కేవలం 1,974 మంది రైతులే చెల్లింపు

జిల్లాలో దాదాపు 3.25 లక్షలకుపైగా రైతులు ఉండగా, 9 లక్షల ఎకరాలకుపైగా పంటలు సాగు జరుగుతుండగా ప్రభుత్వం అనేక దఫాలుగా గడువు పొడిగించుకుంటూ వెళ్లినా.. కేవలం 1,974 మంది రైతులు మాత్రమే బీమా ప్రీమియం చెల్లించడం గమనార్హం. టీడీపీ పాలనలో బీమా చెల్లించడం ఇదొక దండగ అనే అభిప్రాయం రైతులు ఉంది. గతంలోనూ టీడీపీ అధికారంలో ఉండగా రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించినా.. ఏనాడు రైతులకు నష్టం జరిగినా పరిహారం దక్కిన పరిస్థితులు లేవు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితే ఉంటుందని రైతుల్లో నిరాసక్తత కనిపిస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే అనేక సార్లు గడువు పొడిగించినప్పటికీ రైతుల నుంచి స్పందన కరువైందని అర్థమవుతోంది.

ప్రీమియం సొమ్మును కాజేసే కుట్ర

జిల్లాలో 7.77 లక్షల ఎకరాల్లో అధికారిక ఆయకట్టు, అనధికారికంగా మరో 1 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. సుమారుగా 9 లక్షల ఎకరాల్లో పంట వరి సాగు జరుగుతుందని అంచనా. హెక్టార్‌కు రూ.470 ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.170 ప్రీమియం పడుతుంది. 9 లక్షల ఎకరాలకు ప్రీమియం కట్టిస్తే.. సుమారు రూ.15.30 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది. ఈ ప్రీమియం మొత్తాన్ని గత ప్రభుత్వమే చెల్లించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రీమియం మొత్తాన్ని చెల్లించడం నుంచి తప్పుకుని ఆ మొత్తాన్ని రైతుల నుంచి వసూలు చేసి ఖజానా నింపుకోవాలని చూస్తోంది. ఇప్పటికే గతేడాది డిసెంబరు 31వ తేదీ వరకు దాదాపు మూడు సార్లు ప్రీమియం చెల్లింపునకు తుది గడువు విధించింది. రైతులు ముందుకు రాకపోవడంతో తాజాగా ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించింది.

గతంలో అందరికీ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొదటి సంవత్సరం ఒక రూపాయి చెల్లించి బీమాలో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆ తర్వాత నుంచి రైతుల తరఫున ప్రభుత్వమే బీమా చెల్లించి ఉచిత పంటల బీమాను అమలు చేసింది. రైతు పొలం యూనిట్‌గా తీసుకుని పరిహారం అందించింది. దీంతో రైతులు కూడా దీమాగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే



“పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం నగదు చెల్లించాలి. ఇప్పటికే చాలా చోట్ల ఈ బీమా విషయంపై అవగాహన కల్పించాం. కొంత మందే ముందుకు వచ్చారు. జనవరి 15వ తేదీ వరకు గడువు పొడిగించింది. ఈ గడువులోపు రైతుల నుంచి స్పందన తక్కువగా ఉంది. మళ్లీ గడువు పొడిగింపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాను.

– సత్యవాణి, జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి

పంట నష్టం పరిహారానికి కొత్త మెలికలు

రైతులు పంటలకు సంబంధించి బీమాలో నగదు నమోదు చేసుకున్నా.. ఒక్కో పంటకు ఒక్కో రకంగా నిబంధనలు పెట్టడంతో రైతులు కూడా ముందుకు రావడం లేదు. వరికి గ్రామ యూనిట్, మినుము, శనగ పంటలకు మండల యూనిట్‌గా, పెసర, వేరుశనగ పంటలకు జిల్లా యూనిట్‌గా తీసుకోవడంతో పాటు, గత ఐదేళ్ల కాలంలో ఏ ప్రాంతంలో ఎక్కువగా, ఎంత మేర నష్టం వచ్చిందో దానికి అనుగుణంగా బీమా ఇస్తామని ప్రభుత్వం మెలిక పెట్టింది. దీంతో రైతులు కూడా ఈ బీమా నగదు కట్టినా, నష్టం వాటిల్లినా ఇచ్చేది ఉండదనే నిర్ధారణతో ముందుకు రాలేదని పలువురు పేర్కొంటున్నారు.

కండలేరులో 56.040 టీఎంసీల నిల్వ

రాపూరు: కండలేరులో బుధవారం నాటికి 56.040 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 850, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

గుడ్లూరు: మండలంలోని చేవూరు చెరువులో ఓ గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. 16వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనచోదకులు చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసి గుడ్లూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు నీలం, తెలుపు అడ్డగడుల టీషర్టు, నల్లని కాటన్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. ఈ మేరకు ఎస్సై వెంకటరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



కోనేరులో తెప్పోత్సవం

కమనీయం..

వేణుగోపాలుని తెప్పోత్సవం



దీపాలు వదులుతున్న మహిళలు

ఉలవపాడు: ఉలవపాడులో కొలువైన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి తెప్పోత్సవం బుధవారం రాత్రి కనుల పండువగా జరిగింది. గ్రామ నడిబొడ్డున ఉన్న కోనేరులో కనుమ నాడు వేణుగోపాల స్వామి తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. తర్వాత కోనేరులో 11 చుట్లు తెప్పోత్సవం చేశారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

భక్తులు తమ కోర్కెలు తీరాలని కోనేరులో దీపాలు వెలిగించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.39
సన్నవి	రూ.29
పండ్లు	రూ.18

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:125	బ్రాయిలర్ స్కిన్‌లెస్	:250
లేయర్ (లైవ్)	:88	లేయర్	
బ్రాయిలర్ చికెన్	:226	చికెన్	:150

మిరపతోట ధ్వంసంపై ఫిర్యాదు

దగదర్తి (బిట్రగుంట): దగదర్తి మండలం నారాయణపురంలోని తన మిరపతోటను అదే గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నేతలు ధ్వంసం చేశారని దేవరపల్లి చంటి మంగళవారం దగదర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తనపై కక్ష కట్టి, తన అరెకరా పొలంలో సాగు చేసిన మిరప పంటను టీడీపీ నేతలు గ్రద్దగుంట శీనయ్య, గ్రద్దగుంట నవీన్, మారుబోయిన వేణుగోపాల్, శింబోతుల కిరణ్, మాధవరావు, సుధాకర్, రాధాకృష్ణ మంగళవారం వేకువన ధ్వంసం చేశారన్నారు. తన భూమిని బలవంతంగా లాక్కోవాలనే దురుద్దేశంతోనే కొద్ది రోజులుగా బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. మొక్కలు నాటిన రోజు నుంచే తనను బెదిరిస్తున్నారని, మంగళవారం తెల్లవారుజామున మొక్కలు పీకేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశాడు.

సర్వేయర్ల నిర్లక్ష్యం.. రైతుకు శాపం

- భూవివాదాల పరిష్కారానికి గత ప్రభుత్వం చేపట్టి రీసర్వే
- రీసర్వే జరిగిన గ్రామాల్లో భూముల హక్కులు మార్చేసిన సర్వేయర్లు
- విలేజ్ సర్వేయర్ల చేసిన తప్పిదాలకు రైతులు అవస్థలు

రెవెన్యూ గ్రామ స్థాయిలో దశాబ్దాలుగా నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు గత ప్రభుత్వం రీ సర్వే ప్రక్రియను చేపట్టింది. అయితే క్షేత్రస్థాయిలో విలేజ్ సర్వేయర్లు చేసిన తప్పిదాలు, నిర్లక్ష్యం.. రైతుల పాలిట శాపంగా మారింది. యాజమాన్య హక్కుల కాలంలో అస్తవ్యస్తంగా నమోదు చేయడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. సమస్య ఎదురైనప్పటి నుంచి రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలిచ్చినా.. ఫలితం లేకుండాపోతోంది. పట్టా భూములను ప్రభుత్వ భూములుగా, అటవీశాఖ భూములుగా రికార్డుల్లో పొందుపరిచారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు పెట్టి.. అభ్యంతరాలు తెలపాలని కోరారు. అధికారులు మాత్రం రైతుల నుంచి స్వీకరించిన అభ్యంతరాలకు విరుద్ధంగా సర్వేయర్లు తప్పుల తడకలుగా రికార్డులు మార్చేశారు.



దగదర్తి తహసీల్దార్ కార్యాలయం



రీసర్వే తప్పులపై ఇటీవల నిర్వహించిన గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న దగదర్తి రెవెన్యూ అధికారులు (ఫైల్)

దగదర్తి (బిట్రగుంట): దగదర్తి మండలంలో భూముల రీసర్వే సందర్భంగా విలేజ్ సర్వేయర్లు చేసిన తప్పులు రైతుల పాలిట శాపాలుగా మారాయి. రీసర్వేకి సంబంధించి రైతులకు ఎటువంటి సమాచారం అందించకుండా, కార్యాలయాల్లో కూర్చుని ఇష్టారాజ్యంగా భూముల సరిహద్దులు మార్చేయడంతో రైతులు నరకం అనుభవిస్తున్నారు. పట్టా భూములను ప్రభుత్వ భూములుగా, భూముల విస్తీర్ణాన్ని తగ్గిస్తూ ఎకరా ఉన్న భూమిని అరెకరాగా మార్చేయడంతో రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. రీసర్వే తప్పుల సవరణకు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం, స్థానికంగా సవరించేందుకు ఆన్‌లైన్‌లో ఎటువంటి ఆప్షన్ లేకపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు. పట్టా భూములు ప్రభుత్వ భూములుగా నమోదవడంతో రైతులు ఈ దఫా పంట రుణాలు పొందే అవకాశాన్ని కూడా కోల్పోయారు. అనంతవరం రెవెన్యూ విలేజ్ పరిధిలో శ్రీకాంత్ అనే విలేజ్ సర్వేయర్ చేసిన తప్పులకు సుమారు 50 మందికిపైగా రైతుల కమతాలు తారుమారయ్యాయి. చాలా మంది భూముల విస్తీర్ణంలోనూ తేడాలు రాగా, కొంత మందికి ప్రభుత్వ భూములుగా నమోదయ్యాయి. సర్వే సమయంలో డబ్బులిచ్చిన రైతుల భూములు మాత్రమే పక్కాగా సర్వే చేశారని, డబ్బులివ్వని రైతుల విషయంలో ఉద్దేశపూర్వకంగా ఇష్టారాజ్యంగా రికార్డులు మార్చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న విలేజ్ సర్వేయర్ శ్రీకాంత్‌ను బోగోలు మండలానికి బదిలీ చేయడంతో దగదర్తిలో సమాధానం చెప్పే వాళ్లు కూడా కరువయ్యారు. దీంతో బాధిత రైతులు తమ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పాత అడంగళ్ కాపీలు, ఇతర రికార్డులతో గ్రామ సభల్లో పదేపదే అర్జీలు ఇస్తున్నారు. కుప్పలు తెప్పలుగా వస్తున్న అర్జీలతో తహసీల్దార్ కార్యాలయం అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. వీఆర్వో నుంచి తహసీల్దార్ వరకూ సమస్యను ఎలా పరిష్కరించాలో అర్థంకాక, రైతులకు సర్ది చెప్పలేక మౌనం వహిస్తున్నారు.

కలెక్టర్ స్పందిస్తేనే న్యాయం

జిల్లాలో భూముల రీసర్వే తప్పుల సవరణ ప్రక్రియ అంతా గందరగోళంగా తయారైంది. ఇప్పటికి రెండు విడతలుగా గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరించినా సవరణకు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. మరో వైపు రైతులు విడిగా అర్జీలు తీసుకుని తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్‌లోని భూరికార్డుల విభాగం చుట్టూ తిరుగుతున్నారు. ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించడంతో సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. కలెక్టర్ స్పందించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తే తప్ప రైతుల కష్టాలు తొలగే పరిస్థితి కనిపించడం లేదు.

విలేజ్ సర్వేయర్లపై చర్యలకు డిమాండ్

రైతుల భూములు ఇష్టారాజ్యంగా మార్చేసిన విలేజ్ సర్వేయర్లపై రైతులు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. డబ్బుల కోసం భూముల హద్దులు మార్చేసి ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకుంటున్నారని, తాము మాత్రం నెలల తరబడి తహసీల్దార్, కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పు చేసిన విలేజ్ సర్వేయర్లపై కఠిన చర్యలు చేపట్టాలని, మరోసారి ఇలాంటి తప్పులు జరగకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.